

# ప్రమాణం

-ఓడిగుంట నరసింహమూర్తి

"తమరికి కేషిమ్మంటారా లేదా నగానట్రా" అడిగాడతను.

అర్థం కానట్లుగా చూసాడు గోపాలం.

"అదే సార్ కాంట్రాక్ట్ కోసం అప్లికేషన్ ఇచ్చాం గదా దానికి సంబంధించి" అన్నాడు మళ్ళీ.

"ఓహో అదా? అది హెడ్ క్వార్టర్‌కి పంపించాం. అది వాళ్ళు అప్రూవ్ చేసాక చెక్కు గాని, డిడిగాని ఇవ్వాల్సి ఉంటుంది. దానికి నగానట్రా అంటూ ఏం తీసుకోం. ఒకవేళ మీ కాంట్రాక్ట్ ఒప్పుకోకపోతే మీ ఈఎమ్‌డి వెనక్కిచ్చేస్తాం" అన్నాడు తాపీగా గోపాలం.

"అది సర్లెండి సార్ మేం చెప్పేది మీకివ్వాల్సిన డబ్బు గురించి!"

గోపాలానికి ముందే అర్థం అయ్యింది వాళ్ళెందుకొచ్చారో! తను ఈ ఆఫీసుకు కొత్తగా ట్రాన్స్‌ఫరయి వచ్చాడు. తన గురించి కొద్దిగా కూడా తెలియటానికి అవకాశం లేదు.

అక్కడికొచ్చిన వాళ్ళిద్దరూ చాలా బలంగాను, వస్తాదుల్లానూ అన్పిస్తున్నారు.

"ఇక మీరెళ్ళొచ్చు" అన్నట్లుగా చూసాడు గోపాలం.

"సార్ మీరేదో మొహమాటపడ్తున్నట్టున్నారు. ఇంతకుముందు మీ సీట్లో అయిదుగురు పని చేసారు. డబ్బుపడేస్తే అన్ని పనులు చకచకా అయిపోయేవి. అందులో ఒకాయన కూతురు పెళ్ళికి యాభై వేలు సర్దాం లెండి. పాపం ఈమధ్య గుండెపోటొచ్చి పోయాడు. లేకపోతే మీలా నాన్పుడు వ్యవహారం ఆయన దగ్గర అస్సలు లేదు. ఏదో మా ఖర్మ బాగోలేక టైర్లరిగేలా తిరుగుతున్నాం" అన్నాడొకతను విసుగ్గా.

"ఏయ్ మిస్టర్ మీ యిష్టం వచ్చినట్లుగా ఇక్కడ మాట్లాడకండి. వేరేవాళ్ళ ప్రసక్తి నా కనవసరం. నేను పద్ధతి ప్రకారం పోయేవాణ్ని. మీకర్హత వుంటే అదే వస్తుంది. డబ్బుకోసం గడ్డి తినే వాణ్ని కాదు. ముందు మీరిక్కడ్నించి వెళ్ళండి ప్లీజ్!" అంటూ వాళ్ళని బలవంతంగా బయటకు పంపించేసాడు గోపాలం.

ఎక్కడ చూసినా లంచగొండితనం స్వైర విహారం చేస్తోందని తనకూ తెలుసు. మరీ ఇంతగా బరితెగించి ఉంటారని అనుకోలేదు. ఇంతకుముందు వాళ్ళు బాగా సంపాదించి మేడలు కట్టుకున్నట్లు విన్నాడు. అసలు ఈ సమాజంలో లంచం అడిగే వాళ్ళకన్నా ఇవ్వటానికి సిద్ధపడే వాళ్ళే ఎక్కువ కన్పిస్తున్నారు. ఇలా పబ్లిగ్గా వ్యాపారం జరిగిపోతూంటే ఇచ్చిపుచ్చుకునే వాళ్ళు ఇరువురూ దొడ్డిదార్లో సంపాదించేస్తున్నారు. ఈ సబ్జెక్టు ఎన్ని వందల సంవత్సరాలయినా చర్విత చరణం అవుతూనే వుంటుంది. కొంతమంది డబ్బు తీసుకోం అని చెప్పాం కానీ వస్తువులు తీసుకోమని చెప్పలేదు కదా అని బాణాలు విసురుతూ ఉంటారు. అటువంటి వాళ్ళకు మిరపకాయబస్తాలు, నూనె డబ్బాలు, ఫర్నిచర్ చేరుతూనే ఉంటాయి. వాళ్ళకెందుకో తాము లంచం తీసుకోలేదనే తృప్తిపడుతూ ఉంటారు ఎప్పటికీ! ఇలా ఆత్మవంచన చేసుకునే వాళ్ళే ఎక్కువ.

★★★

గోపాలం తండ్రికి ఆస్తిపాస్తులంటూ లేవు. కనీసం చిన్న ఇల్లు కూడా లేదు. కానీ ఆయన చేసిన గొప్ప పని ఏమిటంటే కొడుకులందర్నీ కష్టపడి పెద్దచదువులు చదివించటం. అంతకు మించి తన ఉద్యోగంలో ఎదురైన సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఎటువంటి పరిస్థితులలోనూ అక్రమ మార్గంలో డబ్బు సంపాదించవద్దని కొడుకుల దగ్గర ప్రమాణం చేయించుకోవటం. ఆ మాట మీద నిలబడి గోపాలం, అతని అన్నదమ్ములు తమ ఉద్యోగ విషయంలో జాగ్రత్తగా ఉండేవాళ్ళు.

హెడ్డాఫీసునుండి ఊహించకుండా ట్రాన్స్‌ఫర్ ఆర్డర్స్ రావడంతో గోపాలం హుటాహుటిన బయలుదేరాడు.

★★★

తర్వాత వారం పది రోజులకనుకుంటా హెడ్డాఫీసులో ఒక వార్త దావానలంలా వ్యాపించింది. తన స్థానంలో కొత్తగా వచ్చిన వ్యక్తి సి.బి.ఐ వాళ్ళకు లంచం తీసుకుంటూ పట్టుబడిపోయినట్లు.

గోపాలం గుండె దడదడలాడింది. కొద్దిసేపు కళ్ళు మూసుకుని అలా ఉండిపోయాడు. తను విపత్కరమైన పరిస్థితి నుండి బయటపడ్డాడు. లేకపోతే హఠాత్తుగా ట్రాన్స్‌ఫరెలా వస్తుంది? తనేదైనా బలహీనతకు లొంగిపోయుంటే ఆ పట్టుబడిన ఆఫీసర్ గతి తనక్కూడా పట్టుండేదేమో! తర్వాత శిక్షపడేది. పదిమందిలో పరువుపోయి కుటుంబం వీధి కెక్కేది. పర్స్‌లోంచి తండ్రి ఫోటో తీసి కళ్ళకద్దుకున్నాడు. ఆయన లేకపోయినా పరోక్షంగా తనని వెన్నంటి ఉంటూ తాము చేసిన ప్రమాణాన్ని గుర్తుచేస్తూ ఎప్పటికప్పుడు క్షేమంగా బయట పడేస్తున్నాడు. ఆయన ఆత్మ శాంతికి ఆయన దారిలో నడవటంకన్నా ఏం చెయ్యగలడు?

★